అర్హుల చెంతకే ప్రభుత్వ సేవలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

బంగారుపాళెం : ప్రజా సంక్షేమ పథకాలు, సేవలు అర్హుల చెంతకు చేర్చడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ అమరావతి అన్నారు. బంగారుపాళెంలో సోమవారం జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. అందులో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, నాడు ప్రభుత్వ సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు పొందాలంటే ప్రజలు మండల కేంద్రానికి వెళ్లి అవస్థలు పడేవారని గుర్తు చేశారు. నేడు దరఖాస్తు చేసుకున్న వెంటనే వారి అందుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఉప సర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యులు ఉషారాణి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ప్రత్యేక అధికారి విజయమోహన్ డీటీ ఇబ్రహీం, ఆర్ఐ దీపక్, గ్రామ కార్యదర్శులు శంకరయ్య, అవంతి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో హేమలత



తవణంపల్లె: మండల విద్యాశాఖాధికారిగా హేమలత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పెద్దపంజాణి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న హేమలతను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న శంకరయ్యను తిరుపతి రూరల్ మండలానికి బదిలీ అయ్యారు.

కూరగాయల దాతకు ప్రత్యేక దర్శనం



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయంలో అలంకరణలకు 5 టన్నుల కూరగాయలు విరాళంగా అందించిన పలమనేరు మార్కెట్ కమిటీ సభ్యులు రవీంద్రరెడ్డి బృందానికి సోమవారం సాయంత్రం ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

చిత్తూరుకు పండగ కళ



గంగినేని చెరువు కట్టపై ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లు, జెండాలు

చిత్తూరు రూరల్: సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా చిత్తూరులో పండుగ వాతావరణం నెలకొంది. మెసానికల్ మైదానం నుంచి ప్రశాంత్ నగర్ వరకు భారీగా కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలతో నగరం నిండిపోయింది. ఇవి దారిపొడవునా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దారిలో వచ్చేపోయే వాళ్లు, ముఖ్యంగా మహిళలు మొబైల్ ఫోన్లల్లో వీడియోలు తీస్తూ కనిపించారు. విషయం తెలుసుకున్న నగరవాసులు ప్రత్యేకంగా తరలివచ్చి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను చూసి మురిసిపోయారు. స్థానికుల రాకతో ఆ ప్రాంతం జన సందడిగా కనిపించింది.

ఆలయాల్లో వేడుకగా గురుపౌర్ణమి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీ షిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి కాగడ హారతి, పంచామృత అభిషేకం, సత్యనారాయణ వ్రతం, సంధ్యా హారతి, సాయిభజనలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కుంకుమార్చన చేశారు. నిర్వాహకులు సీకే లావణ్య పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో..

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ షిరిడిసాయి బాబా, అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాయిబాబా చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లో ఉన్న బ్రహ్మానందాశ్రమంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామి ఆధ్వర్యంలో శ్రీసత్య నారాయణస్వామి మూల విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో స్వామివారి చిత్రపటాన్ని మండపంలో ఏర్పాటు చేసి సత్య నారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కేశవానందస్వామి శ్రీసత్యనారాయణస్వామి వ్రత ఫలితం, గురు పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామిని భక్తులు సన్మానించి, ఆశీర్వచనాలు తీసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



చిత్తూరు : కుంకుమార్చనలో భక్తులు

'దోచేస్తున్నాడు.. భాయ్'పై విచారణకు ఆదేశం

పూతలపట్టు(యాదమరి): 'హౌసింగ్‌లో దోచేస్తున్నాడు భాయ్' అనే శీర్షికపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. పూతలపట్టు నియోజకవర్గం హౌసింగ్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతి తంతుపై సాక్షిలో రెండు రోజుల క్రితం దోచేస్తున్నాడు... భాయ్ అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారించి నివేదికలు ఇవ్వాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. దీంతో పీడీ పూర్తి స్థాయిలో విచారణ చేయాలంటూ హౌసింగ్ డీఈని ఆదేశించారు. దీనిపై హౌసింగ్ డీఈ రహస్య విచారణ చేపటినట్టు సమాచారం.

గజరాజుపై కోదండరాముడి విహారం



తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గజ వాహనంపై కోదండరాముడు విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం అర్చకులు ఆలయంలో సీతారామలక్ష్మణులకు ఉభయదారులచే తిరుమంజనం, పాలాభిషేకం చేయించి ప్రత్యేక అలంకరణ, పూజలు ధీపదూప నైవేద్యం సమర్పించారు. సాయంత్రం స్వామికి భక్తి ఊంజల్ సేవను ఉభయదారులచే నిర్వహించారు. రాత్రి ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

నేడు రథోత్సవం

మంగళవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

అర్హులకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

ఐరాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల సేవలకు దరఖాస్తు చేసుకున్న 106 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు ఎంపీపీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఏ అవసరమొచ్చినా జన్మభూమి కమిటీ సభ్యులు, దళారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ ప్రభుత్వ పథకమైనా ప్రజల చెంతకే చేరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణవతి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ హారూన్, ఎంపీటీసీ సభ్యురాలు మమత, స్థానిక నాయకులు ధనచంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, మురళి, నవాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఐరాల సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ మోహన్